క్లుప్తంగా

రేపు 'యువ వికాసం' ఇంటర్వ్యూలు

కల్వకుర్తి టౌన్: రాజీవ్ యువ వికాసానికి సంబంధించిన ఇంటర్వ్యూలు సోమవారం నుంచి నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12న యూనియన్ బ్యాంకు పరిధిలో, 13న తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో, 16న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 17న బీసీ, ఈబీసీ అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

14 నుంచి ఇంటర్వ్యూలు

అచ్చంపేట: మున్సిపల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల14 నుంచి 19వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కమిషనర్ యాదయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ సెట్ తీసుకురావాలని కోరారు. 14న తెలంగాణ గ్రామీణ బ్యాంకు, 16వ తేదీన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 19న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

కల్వకుర్తి రూరల్: భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీలు వెంటనే రద్దు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, హిందూ వేదిక నాయకుడు పరశురాములు శనివారం వేర్వేరు ప్రకటనలో కోరారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఐపీఎల్ పోటీలు నిలిపివేశారని అదేవిధంగా అందాల పోటీలను కూడా నిలపాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

పెంట్లవెల్లి: మండలంలోని యంగంపల్లి తండాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం పంచాయతీ సెక్రెటరీ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌ల పాలన ముగిసిన తర్వాత గ్రామసభలు నిర్వహించడం లేదని వివరించారు. గ్రామసభలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోయారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, హేమచంద్ర, మురళి, శ్రీను, కోటి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు



కల్వకుర్తి టౌన్: రక్తదాతలు ప్రాణదాతలు అని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం కొనియాడారు. శనివారం పట్టణంలోని సీహెచ్‌సీలో లయన్స్‌క్లబ్, హెచ్‌డీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలు సామాజిక సంఘాల నాయకులు, ప్రజలు, ఆస్పత్రి సిబ్బంది రక్తదానాన్ని చేశారు. రక్తదానం చేసిన దాతలకు ప్రశంసాపత్రాలను సీనియర్ వైద్యులు దామోదర్‌రెడ్డి అందించారు. రక్తదానం శిబిరంలో 35 యూనిట్ల రక్తాన్ని సేకరించామని, సేకరించిన యూనిట్లను జిల్లా కేంద్రంలోని బ్లడ్‌బ్యాంకుకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, నాయకులు షానవాజ్, మిత్ర ఫౌండేషన్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుడికి ఘన సన్మానం



కల్వకుర్తి రూరల్: భారత సైన్యంలో సియాచిన్ పరిధిలో విధులు నిర్వహిస్తూ సెలవుపై గ్రామానికి వచ్చిన శ్రీనివాస్‌ను శనివారం పట్టణంలోని పద్మశాలి భవనంలో సన్మానించారు. ఆర్మీ నుంచి విధుల్లో చేరాలని పిలుపురావడంతో సెలవులను రద్దు చేసుకొని వెళ్తుండటంతో ఆయనను పలువురి కలిసి శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

పట్టణానికి చెందిన కవికి..

కల్వకుర్తి రూరల్: తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తెలుగు భాషకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన కవి కర్నాటి రఘు రాములు గౌడ్ పాల్గొని పలు కవితలతో మైమరిపించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు బడే సాబ్, గుంట మనోహర్ రెడ్డి, దైవజ్ఞ శర్మ తదితరులు ఘనంగా సత్కరించారు.

యువతి అదృశ్యం

తిమ్మాజిపేట: యువతి అదృశ్యమైన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాజిపేటలో యువతి(19) మామ ఇంటి వద్ద ఉంటూ కుట్టుమిషన్ నేర్చుకుంటుంది. గత నెల 26న టైలరింగ్ నేర్చుకోవడానికి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. యువతి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రహదారులపైనే నూర్పిళ్లు

- ప్రమాదాలబారిన వాహన దారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



చారకొండలో ధాన్యం కుప్పలు



తిమ్మాయిపల్లిలో రోడ్డుపై ధాన్యం ఆరబోత

చారకొండ: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. కాని ధాన్యం రాశులను ఆరబెట్టేందుకు స్థలం లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తీసుకొచ్చిన ధాన్యం ఎక్కడ ఆరబెట్టాలో తెలియక సతమతమవుతున్నారు. దీంతో చేసేదేమి లేక వరికోతలు ముగిసిన తర్వాత సమీపంలోని రహదారులపై నూర్పిళ్లు ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

వాహనదారులకు తప్పని తిప్పలు

ధాన్యం రాశులను రోడ్లపైనే ఆరబెడుతున్నారు. రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి నుంచి మొదలుకొని చారకొండ వరకు ధాన్యం రాశులతో రోడ్లు నిండిపోతున్నాయి. సగం రోడ్డు ధాన్యం కుప్పలతో ఆక్రమిస్తుండటంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. చిన్న, పెద్ద గ్రామాల్లో రోడ్డుపై ధాన్యం కల్లాలుగా దర్శనమిస్తున్నాయి. వాహనదారులకు రాత్రివేళ ధాన్యం కుప్పలు కనిపించక, టార్పలిన్‌లతో ధాన్యం రాశులపై కప్పడంతో వాటిని తప్పించబోయి, పలు ప్రమాదాలబారిన పడుతున్నారు. గత సంవత్సరంలో వంగూరు మండలానికి చెందిన వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తు ధాన్యం కుప్ప కనిపించక ప్రమాదం బారిన పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇప్పటికి నిత్యం ఏదో రకంగా ధాన్యం కల్లాలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ, ఇబ్బందులు తప్పడం లేదు.

పొలాల్లో కల్లాలు లేకపోవడంతో..

మండల వ్యాప్తంగా వరి సాగుకు 3100 ఎకరాల భూమి అనుకూలంగా ఉంది. యాసంగిలో మొతం 2931 వరిసాగు చేశారు. ప్రస్తుతం వరికోతులు ముగిశాయి. రైతులకు పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో రోడ్డుపై ధాన్యంను ఆరబోసుకుంటున్నారు. కల్లాల నిర్మాణం కోసం గతంలో ఉపాధి నిధులు కేటాయించినప్పటికి సద్వినియోగం చేసుకునేలా అధికార యంత్రాగం సరైన అవగాహన కల్పించకపోవడంతో గ్రామాల్లో రైతులు కల్లాల నిర్మాణం చేపట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మండలంలోని చారకొండ, జూపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శనకు వచ్చినప్పుడు మండలంలోని తిమ్మాయిపల్లి వద్ద ప్రధాన రహదారిపై ధాన్యం ఆరబెట్టడాన్ని చూసి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసేందుక, లోడ్ చేసేందుకు అనువుగా స్థలం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

మూడు సంవత్సరాల వరి పంట సాగు వివరాలు

సంవత్సరం	వానాకాలం	యాసంగి
2023	1102	2579
2024	1619	1897
2025	1776	2931

ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు



ప్రతి ఏటా పండించే వరిధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రధాన రహదారిపై ఆరబెడితే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. కల్లాల నిర్మాణానికి ప్రభుత్వం మరొకసారి అవకాశం ఇవ్వాలి. రహదారులపైన ఆరబెడితే అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

– జమ్ముల నాయక్, సారంబండ తండా

కల్లాల నిర్మాణానికి అవకాశం లేదు

గతంలో వ్యవసాయ పొలాల్లో పంట నూర్పిళ్లకు కల్లాల నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉండేది. కొందరు రైతులు కల్లాల నిర్మాణాలు చేపట్టి మధ్యలోనే పనులు నిలిపివేశారు. ప్రస్తుతం కల్లాల నిర్మాణాలకు అవకాశం లేదు.

– లక్ష్మయ్య, ఏపీఓ, చారకొండ

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



తిమ్మాజిపేటలో స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/తిమ్మాజిపేట/బిజినేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ రైతులకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ వారికి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం తిమ్మాజిపేటలోని రైతువేదికలో పలువురు రైతులకు స్ప్రింక్లర్లు అందజేసి మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్, రూ.2 లక్షల రుణమాఫీ, గృహజ్యోతి, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు తదితరవి అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన లక్ష్మీనర్సింహస్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 24 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం తూడుకుర్తిలో మండల పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన సబ్సిడీ స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు.

■ బిజినేపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగనమోని తిరుపతయ్య, కత్తె ఈశ్వర్, అమృత్‌రెడ్డి, మిద్దె రాములు, మధుసూదన్‌రెడ్డి, కదిరె రాము, అభిషేక్‌రెడ్డి, వీరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణోత్సవం



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో నృసింహ జయంతిని పురస్కరించుకొని శనివారం చెంచు కాలనీలో కొలువుదీరిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. మంత్రోచ్ఛరణల మధ్య దేవతామూర్తుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వనవాసీ కల్యాణ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఇత్తడి తొడుగుల బహూకరణ

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామానికి చెందిన చిలుక దివ్య, వివేక్‌రెడ్డి దంపతులు శనివారం రూ.2.50 లక్షలు విలువ చేసే ధ్వజస్తంభ ఇత్తడి తొడుగులను లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు ఉన్నారు.



సైనికులకు మద్దతుగా పూజలు



అచ్చంపేట రూరల్: భారత సైనికులకు మనోధైర్యం, విజయం కలిగించాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఉట్ల కోనేరు ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ చాలీసాను పఠించారు. కార్యక్రమంలో బాలాజీ, దామోదర్‌శెట్టి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, వెంకటేష్, సునీతాబాయి, శ్రీనివాస్‌గౌడ్, హేమలత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భారత్ గెలుపొందాలని ..

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామ సమీపంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ గెలుపొందాలని స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, వివేక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అందుబాటులో గన్నీ బ్యాగులు



వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో అధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయా గ్రామాల రైతులకు గన్నీ బ్యాగులను అందజేశారు. గతంలో గన్నీ బ్యాగుల సమస్య ఉండేదన్నారు. గన్నీ బ్యాగులు పాతవి కావడంతో తరుచుగా రైతులు ఇబ్బందులు పడ్డారని ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో నూతనంగా గన్నీ బ్యాగులు సరఫరా చేయించినట్లు వివరించారు. రైతులందరు కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయించుకోవాలని కోరారు.

కొండనాగుల పెద్దగుడిలో చోరీ

బల్మూర్: మండలంలోని కొండనాగులలో పెద్దమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. వెండి, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రేమ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని అచ్చంపేట ప్రధాన రహదారిలో పెద్దమ్మ దేవాలయంలో గుర్తు తెలియని దొంగలు గుడి తాళం విరగొట్టి 12 తులాల వెండి, అమ్మవారి మెడలోని పావు తులం బంగారు పుస్తే దొంగిలించారు. గుడి పూజారి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అమర సైనికులకు ఘన నివాళి



అచ్చంపేటలో నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

తిమ్మాజిపేట: దేశం కోసం అసువులు బాసిన వీర సైనికులకు తిమ్మాజిపేటలో శనివారం రాత్రి పలువురు నాయకులు, యువత ఘన నివాళులు అర్పించారు. పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో ఏపీకి చెందిన మురళీ నాయక్, మహారాష్ట్రకు చెందిన ఓ జవాను అమరులయ్యారు. వారి ఆత్మకు శాంతి కలగాలని పలువురు నాయకులు, పలు యువజన సంఘాలకు చెందిన యువకులు కొవ్వొత్తులు వెలిగించి గ్రామంలోని ప్రధాన వీధులగుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ కుపానందం, దిలీప్, శేఖర్, నాయకులు ప్రదీప్, గోపిగౌడ్, హుస్సేనీ, వేణుగోపాల్, కొత్తవెంకటేష్, రవినాయక్, సైఫ్, శివ, నిశ్వంత్, ఆనంద్‌చారి, యాహఖాన్, శేఖర్ పాల్గొన్నారు.

జవాన్ మురళీనాయక్ త్యాగం మరిచిపోలేం

అచ్చంపేట రూరల్: భారత జవాన్ మురళీ నాయక్ త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి, గిరిజన సంఘం నాయకులు అన్నారు. శనివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొల్లాపూర్: భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమరులైన జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్‌లకు కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. భాస్కర్ యాదవ్, శరబందరాజు, లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



స్ప్రింక్లర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్: రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అమ్రాబాద్ మండల కేంద్రంలో రైతులకు స్ప్రింక్లర్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రుణమాఫీ చేసిందని ఆయన గుర్తు చేశారు. సన్న వడ్లకు బోనస్, ఎలాంటి షరతులు లేకుండా అన్ని రకాల ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తుందన్నారు. యాంత్రిక వ్యవసాయాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం నిరంజన్ షావలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం లింగమయ్య స్వామి, మాచారంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి పూజారులు, మత పెద్దలు, మండల ప్రజలతో ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ప్రజా ప్రతినిధులు సంబు శోభ, ప్రణీత, రహీం, శ్రీనివాసులు, రవి బాలమ్మ, సుజాత, నాయకులు వెంకటరమణ, చత్రునాయక్, మల్లికార్జున్, రేణయ్య, సత్యనారాయణ, రాజారాం, అంబనారాయణ, రాజేంద్ర ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం అర్చన, ధ్వజారోహణం, హోమం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. సాయంత్రం నిత్యహోమం, పూర్ణాహుతిచ బేరిపూజ, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతోబ్రహ్మోత్సవాలు



తాడూరు: మండలంలోని సిర్సవాడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు రెండోరోజు కొనసాగాయి. శనివారం స్వామివారికి సుప్రభాత సేవ, సామూహిక యజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు పూజారి జగదీశ్వరాచారి తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులు కావాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం.. మెమోలు జారీ

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందికి శనివారం అధికారులు మెమోలు జారీ చేశారు. వంగూరు మండలం తిప్పరెడ్డిపల్లికి చెందిన లక్ష్మమ్మ వైద్యం కోసం జనరల్ ఆస్పత్రికి వచ్చింది. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది సరైన వైద్యం అందించకపోవడంతో బీజేపీ నాయకుడు భరత్ ప్రసాద్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఒక వైద్యుడితో పాటు నలుగురు నర్సింగ్ ఆఫీసర్లకు ఆయన మెమోలు జారీ చేశారు.

ఘనంగా పీవీ రావు జయంతి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని మాల మహానాడు భవనంలో శనివారం మాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పీవీరావు 76వ జయంతిని నిర్వహించారు. పీవీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాల ఉద్యోగుల ఐక్య వేదిక అధ్యక్షుడు కల్ముల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేశారని గుర్తు చేశారు. మాల మహానాడు స్థాపించి చివరి శ్వాస వరకు దళిత బహుజన అస్తిత్వం, ఐక్యత, హక్కులు, సాధికారత కోసం నిరంతరం పాటుపడ్డారని కొనియాడారు. మాల మహనాడు అధ్యక్షుడు కల్ముల బాలస్వామి, నారాయణ, లింగయ్య, పాండు, రవీందర్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, శ్రీనివాసులు, ప్రవీణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాలను తెరిపించాలి

పెద్దకొత్తపల్లి: మండలంలోని 1 5గ్రామ పంచాయతీలలో ఉన్న మీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఒక్కక్క మీ సేవ కేంద్రాన్ని రూర్బన్ మిషన్ పథకంలో రూ.10.50 లక్షలతో నిర్మించారు. మీ సేవ సామగ్రిని గ్రామ పంచాయతీ సిబ్బంది వాడుకుంటున్నారు. మీ సేవ కేంద్రాలకు ఇంటర్నేట్ కనెక్షన్ ఇచ్చి ఆపరేటర్లను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విసయమై ఎంపీడీఓను వివరణ కోరగా త్వరలో మీసేవ కేంద్రాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపిడిఓ నాగేందర్ తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం



తాడూరు: మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులను శనివారం గ్రామస్తులు సన్మానించారు. వారం రోజుల కిందట తిమ్మాజిపేట మండలం మారెపల్లిలో ప్రీమియర్ లీగ్ పోటీలలో పాపగల్ టీం పాల్గొని ఆడిన అన్ని మ్యాచ్‌లలో గెలిచి మొదటి బహుమతి రూ.21116 నగదుతో పాటు షీల్డ్ అందుకున్నారు. ఈ మేరకు గ్రామస్తులు క్రీడాకారులను అభినందించి భవిష్యత్‌లో గ్రామానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



చారకొండ: వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ శంషోద్దీన్ అన్నారు. మండల కేంద్రం సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై శనివారం వాహనాలను తనిఖీచేసి సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఆటోలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం 1342 మంది ఉపాధి కూలీలు ఫీడర్ ఛానల్, ల్యాండ్ లెవలింగ్ పనులు చేస్తున్నారు. కొత్తగా పనులకు వచ్చే కూలీలు ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా జాబ్ కార్డులు పొందిన తర్వాత పనులకు రావాలని సూచించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి.

కానిస్టేబుల్‌కు నివాళి

లింగాల: మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ మోట మహేందర్ పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందాడు. శనివారం మండల కేంద్రంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిగి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, ప్రజలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.



ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలి



సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం అధికారికి హమాలీలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాములు, హమాలీలు చంద్రయ్య, జంగయ్య, బక్కయ్య, రేణయ్య, రాము, కార్మికులు పాల్గొన్నారు.